


యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ధర్మ దర్శనానికి 4 గంటలు, ప్రత్యేక దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 70 వేల మంది భక్తులు దర్శించుకోగా స్వామి వారి ఖజానాకు రూ.1,09,40,868 ఆదాయం సమకూరిందని ఈవో గీత తెలిపారు. – యాదగిరిగుట్ట





## కంకలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని స్వయంభూగా వెలిసిన శ్రీకేతేశ్వర-కంకలమ్మ జాతర ఆదివారం జనసంద్రంగా మారింది. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దాదాపు 50 వేల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు నిర్వాహకులు అంచనా వేశారు. – కౌటాల



సోమాజిగూడలోని యశోద దవాఖానలో ఆదివారం కేసీఆర్‌ను పరామర్శించిన అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

# కేసీఆర్‌కు రేవంత్ పరామర్శ

మొదటిపేజీ తరువాయి...

మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం ఇప్పటికే సీఎస్ సహా సంబంధితశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. మంచి ప్రభుత్వ పాలన అందించేందుకు కేసీఆర్ సూచనలు అవసరమని, ప్రజల పక్షాన అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడాల్సిన అవసరమున్నదన్నారు. త్వరగా కోలుకొని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కేసీఆర్‌ను కోరినట్టు రేవంత్ చెప్పారు.

### పరామర్శించిన మంత్రులు, నేతలు

కేసీఆర్‌ను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వీహెచ్ హన్మంతరావు, మాజీ మంత్రి కోదండరెడ్డి, ఎంపీ టి రాములు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రవణ్ పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌కుమార్, కవితను కలిసి.. కేసీఆర్ ఆరోగ్యంపై ఆరా తీశారు.

# దేశమంతా కరువు.. తెలంగాణ కల్పతరువు

మొదటిపేజీ తరువాయి...

వాతావరణ పరిస్థితుల ఏదైనా ప్రాంతంలో పంటకు 50 శాతానికిపైగా నష్టం జరిగితే ఆ ప్రాంతాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటిస్తారు.

### ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ప్రస్తుతం దేశ మొత్తం వైశాల్యంలో కరువు పీడిత జిల్లాల విస్తీర్ణం దాదాపు 1/6వ వంతుగా ఉన్నది. దేశంలోని మొత్తం 717 జిల్లాల్లో 221 జిల్లాలు తీవ్రమైన కరువు కోరల్లో చిక్కుకున్నట్టు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత 15 సంవత్సరాల్లో దాదాపు 100 జిల్లాలు 9 సార్లు కరువు పరిస్థితులను ఎదుర్కొన్నాయని.. బీహార్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో కరువు నానాటికీ పెరుగుతున్నదని స్పష్టం చేస్తున్నాయి. 1997 నుంచి భారత్‌లో కరువు పీడిత ప్రాంతం ఏకంగా 57% పెరిగిందని, 2020-22 మధ్య కాలంలో దాదాపు మూడింట రెండు వంతుల మందిని కరువు ప్రభావితం చేసిందని కాప్-15 (15వ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలో దేశంలోని మూడింట ఒక వంతు జిల్లాలు 4 కంటే ఎక్కువ సార్లు కరువును ఎదుర్కొన్నాయని, భారత్‌లో ఏటా 5 కోట్ల మందిని కరువు ప్రభావితం చేస్తున్నదని ఆ నివేదిక పేర్కొన్నది. కరువు వల్ల 2018-19 నాటికి దేశంలోని మొత్తం సాగుభూమిలో దాదాపు 30% తగ్గిపోయిందని, తీవ్రమైన వ్యవసాయ కరువుల వల్ల 1998-2017 మధ్య కాలంలో స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 2 నుంచి 5 శాతం మేరకు క్షీణించిందని 2021లో ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది.

### కరువు పీడిత ప్రాంతాలు

| | | |
|---|---|---|
| కర్ణాటకలో 216 తాలుకాలు | తమిళ నాడులో 25 బ్లాకులు | ఒడిశాలో 9 జిల్లాలు |
| మహారాష్ట్రలో 42 తాలుకాలు | ఏపీలో 103 మండలాలు | |

### రైతుల ఆందోళన బాట

నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) మార్గదర్శకాలకు అనుగుణంగా దేశంలోని అనేక రాష్ట్రాలు కరువు పీడిత ప్రాంతాల జాబితాలను ప్రకటిస్తున్నాయి. కర్ణాటకలో 216 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించి, సాయం కోసం కేంద్రానికి నివేదిక సమర్పించారు. ఏపీలో 103 మండలాలు, తమిళనాడులో 25 బ్లాకులు, మహారాష్ట్రలో 42 తాలుకాలు, బీహార్‌లో 96 బ్లాకులు, ఒడిశాలో 9 జిల్లాల్లో కరువు నెలకొన్నట్టు నిర్ధారించారు. వీటితోపాటు జార్ఖండ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నప్పటికీ వాటిని ఇంకా కరువు ప్రాంతాలుగా ప్రకటించలేదు. వాస్తవానికి చాలా రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులకు విరుద్ధంగా కరువును తక్కు వ చేసి చూపుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. రిజర్వాయర్లలో తగ్గిన నిల్వలు ఈసారి దేశవ్యాప్తంగా రిజర్వాయర్లలో నీటినిల్వలు వేగంగా అడుగంటిపోతున్నట్టు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) వీక్లీ నివేదిక స్పష్టం చేస్తున్నది. దేశంలోని మొత్తం 150 రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 257.812 బీసీఎం (బిలియన్ క్యూబిక్ మీటర్లు)గా, లైవ్ స్టోరేజీ సామర్థ్యం 178.784 బీసీఎంగా ఉన్నది. అంటే ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో 69.35% మాత్రమే వినియోగించుకోగలం. కానీ, ప్రస్తుతం వినియోగానికి 115.172 బీసీఎం నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇది గత 10 సంవత్సరాల సగటు (124.443 బీసీ ఎం) కంటే చాలా తక్కువ. నిరుడు ఇదే సమయానికి దేశంలోని రిజర్వాయర్లలో 144.526 బీసీఎం ప్రత్యక్ష నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 80% రిజర్వాయర్లలో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉన్నట్టు సీడబ్ల్యూసీ వెల్లడించింది.



దేశవ్యాప్తంగా కరువు ఛాయలు ఉండగా, తెలంగాణ పుష్కలమైన సాగునీటితో కల్పతరువుగా మారింది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పంచదేవ్‌పహాడ్‌లో యాసంగి వరినాటు పనుల్లో నిమగ్నమైన రైతులు, వ్యవసాయ కూలీలు

### తెలంగాణలో భిన్నమైన పరిస్థితి

దేశంలోని చాలా ప్రాంతాలల్లో కరువు నెలకొన్నప్పటికీ తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. గత 8 ఏండ్లలో రాష్ట్రంలోని ఒక్క మండలాన్ని కూడా కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడలేదు. స్వరాష్ట్రంగా ఏర్పడ్డాక తెలంగాణలో జలసంరక్షణకు కేసీఆర్ ప్రభుత్వం పలు చర్యలను చేపట్టడం, బహుముఖ వ్యూహాలను అమలు చేయడమే ఇందుకు కారణమని చెప్పవచ్చు. మిషన్ కాకతీయ కింద చెరువుల్లో పూడిక తీయడం, నీటి వృథాను అరికట్టడం, వాగులపై ఎక్కడికక్కడ చెక్‌డ్యామ్‌లను నిర్మించి నీటిని నిల్వ చేయడం, పలు ప్రాజెక్టులను నిర్మించి వాటిని చిన్ననీటి వ్యవస్థలకు అనుసంధానించడంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. హరితహారం ద్వారా మొక్కల పెంపకంతో పర్యావరణ వ్యవస్థలో గణనీయ మార్పులు వచ్చాయి. ఈ చర్యల ఫలితంగా కరువు రక్కసి తెలంగాణ దరిదాపుల్లోకి కూడా వచ్చే పరిస్థితి లేదు.




### ఎంసీఆర్‌హెచ్చార్డీని సందర్శించిన సీఎం

- ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణపై ఆరా

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్చార్డీ)ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. సంస్థ కార్యకలాపాలను, అక్కడ ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థలోని వివిధ బ్లాకులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ కార్యకలాపాలను వివరించారు. సీఎం వెంట పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సంస్థ అడిషనల్ డైరెక్టర్ మహేశ్ దత్, సీజీజీ డీజీ రాజేంద్ర నిమ్జే, మాజీ మంత్రి షబ్బీర్ అలీ తదితరులు ఉన్నారు.



కేసీఆర్ కోలుకోవాలని కాంక్షిస్తూ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న ఎంపీ వద్దిరాజు దంపతులు

# కేసీఆర్ కోలుకోవాలని పూజలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని రాష్ట్రవ్యాప్తం పూజలు, ప్రార్థనలు చేశారు. ఆదివారం హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. కేసీఆర్ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కుటుంబీకులు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరి, నిఖిల్‌చంద్ర, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు గంగుల సందీప్, గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఎన్నికల సందడి

- ఈ నెల 27న పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- ఓటు వేయనున్న 39,748 మంది కార్మికులు
- పోలింగ్ కోసం 84 కేంద్రాల ఏర్పాటు
- కోర్టుకు వెళ్లే యోచనలో కొన్ని సంఘాలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందడి మొదలైంది. ఈ నెల 27న ఎన్నికలు జరగనుండగా అందుకు సంబంధించిన ప్రక్రియ ఊపందుకుంది. ఈ ఎన్నికల్లో 11 ఏరియాల్లో 39,748 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. టీబీజీకేఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, ఇఫ్టూ వంటి సంఘాలు పోటీపడుతున్నా.. ప్రధాన పోటీ మాత్రం టీబీజీకేఎస్, కొన్ని జాతీయ కార్మిక సంఘాల మధ్యే ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు ఉన్నప్పటికీ వీటి అనుబంధ కార్మిక సంఘాలైన ఎన్‌ఐటీయూసీ, ఏఐటీయూసీ వేర్వేరుగా ఎన్నికల్లో పోటీచేస్తున్నాయి.

### వాయిదాకు యత్నాలు

ఎన్నికల ప్రక్రియ ఊపందుకున్నప్పటికీ అసలివి జరుగుతాయా? అన్న సందేహాలు కూడా నెలకొన్నాయి. కొన్ని సంఘాలు కోర్టుకు వెళ్లి ఎన్నికలను వాయిదా వేయించే ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ పనిచేసిన సంఘాలే మళ్లీ రంగంలోకి దిగినట్టు తెలుస్తున్నది. సింగరేణిలో బలమైన టీబీజీకేఎస్‌కు ప్రస్తుతం అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కార్మికులకు లబ్ధి చేకూర్చే 60కి పైగా డిమాండ్లను సాధించడం, వారసత్వ ఉద్యోగాలు వంటి అనేక విజయాలను టీబీజీకేఎస్ సాధించింది. గత రెండు ఎన్నికల్లో అన్ని చోట్లా టీబీజీకేఎస్ విజయం సాధించింది. ఈసారి కూడా దానికే విజయావకాశాలు పుష్కలంగా ఉన్నాయి. జాతీయ కార్మిక సంఘాలు కార్మికుల విశ్వాసాన్ని చూరగొనలేక పట్టు కోల్పోయాయి. ఎన్నికలను వాయిదా వేయించి, బలం పుంజుకున్న తర్వాత ఎన్నికలను ఎదుర్కోవాలన్న ఆలోచనలో ఉన్నట్టు కార్మికవర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్నది. అంతేకాదు, మరో ఒకటి రెండ్రు రోజుల్లోనే కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని కూడా చెప్తున్నారు.



### 84 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికల నిర్వహణకు కార్మికశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. పోలింగ్ కోసం వివిధ ప్రాంతాల్లో మొత్తం 84 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నది. కార్పొరేట్ ఏరియాలో ఐదు, కొత్తగూడెంలో ఆరు, ఇల్లెందులో మూడు, మణుగూరులో ఏడు, రామగుండం-1లో 11, రామగుండం- 2లో ఆరు, రామగుండం- 3లో ఆరు, భూపాలపల్లిలో 9, బెల్లంపల్లిలో 5, మందమర్రిలో 11, శ్రీరాంపూర్ లో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ రోజే రాత్రే ఓట్లను లెక్కిస్తారు. ఇందుకోసం 12 ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కార్మికశాఖ తెలిపింది.